# బుడ్డబెదిరింపులు

చిక్కుల్లో సిగులు కుణ్ణప్పుడు శివుడ్ని తలవనోడు కాలో చెయ్యో యిరిగి పాయ్‌నపుడు ఈసలాపురానికి పోనోడు ఉండరంటారు. అడపా దడపా శివుణ్ణి అయినా తల్సుకుణ్ణానేమో గానీ ఈసలాపురం మాత్రం నేను చూళ్లే. అదేమంత దూరాబారమని కాదు. ఈడెక్కితే ఒక్క గంటల్లో ఆడికి పాయ్ దిగచ్చు. అయినా చిట్కా వైదిగాలంటే నాకు చెప్పలేనంత మంట!

లచ్చలకు లచ్చలు కర్సు పెడ్తా ఉండారు. ఏండ్ల పొడగనా చదవతా ఉండారు. డాక్టర్లవతా ఉండారు. మల్లా కంటి మిందొకడు. పంటి మిందొకడు. ఎమిక మిందొకడు. ఏలి మిందొకడు. కండ మిందొకడు. గుండె మిందొకడుగా పెతేకంగా పెసలైజ్ చేస్తావుండారు. ఏ ఎమిక తీరు ఎటువుంటిదో అటువుంటి డాక్టర్లకు తెలవకుండా నాటువైదిగం చేసుకుండే ఆ మోటుగాళ్లకా తెలిస్తింది? అని ఒక్క మాటతో కొట్టిపారేస్తా ఉంటి. అయితే ఆమద్దె ఒకనాడు ఎవుడో ఒక పెద్ద పత్రికలో ఈసలాపురం వైదిగాన్ని ఆకాశానికి ఎత్తేస్తా తెగబారడు రాసిపారేసుండె. పత్రికల వాళ్ల దేముండాదిలే? అనుకుంటే ఆకాశానికి లేకుండాబోతే పాతాళానికి! అని సరిపెట్టు కుందామంటే మణుసు కుదట పళ్లా. కుర్దుగా పాయ్ చూసిరావాలని కొటకలాడె. అందుకే పోతి. ఒక పూటంతా ఆణ్ణే ఉంటి. కట్టు కట్టించుకున్నోళ్లతో కట్టించుకోవాలని వచ్చినోళ్లతో మాట మాట కలిపితి. రాదీసి రాళ్లేద్దామని కాదు. నిజం తెల్సుకుందామని. అప్పుడు తలొంచితి- వాళ్ల బెదిరింపుల ముందర! మల్లా తలెత్తింది ఎప్పుడు? బస్సులో కూసోని!

బస్సులో కూసుణ్ణానన్న మాటేగాని మణుసు ఈసలాపురాన్ని యిడ్సిపెట్లేదే? కండ్లు మూసుకుణ్ణా ఆ వైదిగులే కండ్లల్లో మెదల్తా ఉండారు. పోనీ! వాళ్లేమన్నా నీళ్లకవతల

సీమలగ్గాదు కడాన పక్కన్నేవుండే చెన్నపట్నానికన్నా పాయ్ చదువుకోనొచ్చినారా? అంటే లేదే. ఎద్దలగొట్టి ముద్దలు తినే మణుసులకు వాళ్లకు ఏం వెత్తాసమే కనపళ్లా? అయినా వాళ్ల పాసుగూల! ఎంత లేసుగా యిరిగిన ఎమికను ఎమికతో జతగలపతా ఉండారు. జతగలిపి పట్టుకోని ఏందో అంత పసురాకు పూస్తారు. రొండు ఎదురుదబ్బలు పైనొకటి కిందొకటి పెడ్తారు. పాత గుడ్డ పేలికలేసి చుడ్తారు. ఇంక లేచి పోతావుండు! అని తరిమేస్తా ఉండారు.

వారాలు తిరగక ముందే ఎమికతో ఎమిక ఏకమైపోతా ఉండాది!

ఎక్కడుండాదబ్బా దీనికి బిస?

ఎక్కణ్ణో యాడుండాది? అంతా యిక్కణ్ణే ఉండాది. అయితే ఏంది? ఎందుకు పని కొస్తింది? అని తెల్సుకుండేదే మణిసి చేసే పని. నూటికో కోటికో ఎవుడో ఒకడు తెల్సుకుణ్ణాడే అనుకో. ఇంక వాణ్ణి పట్టేదానికి పగ్గాలే ఉండవే? అదంతా తన ప్రెతాపమే అని యిర్రయిగతాడే? పాపం! ఈసలాపురంలో రాజులు అట్టగాదే? ఎవురో వాళ్ల తాత ముత్తాతలు. ఆ ఆకు పసురుకుండే పవురు తెల్సుకుణ్ణారు. ఆ పొద్దుట్నుంచీ వైదిగం చేస్తానే ఉండారు. ఇస్తే తీసుకుంటారు. లేదంటే గమ్మునుంటారు. ఇంతియ్యాలన్న నిర్బందన ఏమీ లేదు. అది గదా నిజింగా మానవ సేవంటే?

అయినా ఆ ఆకు పసుర్లో ఎంత పవురుండాది? అవునుగదా మరి? కొన్ని ఆకులు అట్టా వొంటికి తగిల్తే చాలు. దురద పుడ్తింది. ఇంకొక ఆకుతో రుద్దితే ఆ దురద పోతింది. కొన్ని ఆకులు పాణాలు తీస్తాయి. కొన్ని ఆకులు పాణాలు నిలబెడ్తాయి. ఇంక మరులమందాకు ఉండనే ఉండాది. సరే! యిదంతా అష్ట తెలువులున్న మణిసి పరీచ్చిస్తాడు. లేదా అనుబోగంతో తెల్సుకుంటాడు. అదే గొడ్డూ గోదా? వాటికేం తెల్సు? అవ్వి వొంటికి సెబ్బర చేసే ఆకులు తినమన్నా తినవే? అదేగదా అచ్చెర్రెం? –

అందుకే అన్నీ తెల్సుననుకునే మణిసికి ఏమీ తెల్దనుకోవాల? అంతేగదా? నిన్న మొన్నటిదాకా ఆ మోటుగాళ్లకేం తెల్సు? అంతా బుడ్డబెదిరింపులే అనుకుంటా ఉంటి. ఇప్పుడు వాళ్లనే ఎత్తినెత్తిన పెట్టుకుంటా ఉండా.

నా ఆలోచన్లు ఒక ముంపు మింద ఉండాయి. బస్సు ఒక మోపన పోతా ఉండి ఉణ్ణెట్టుండి ఒక కనమలో నిలబడి పాయ. చుట్టూరా అడివి. ఆ అడివి గుండెల్లో దూరిపోతా ఉణ్ణెట్టు బాట. ఆ బాటమింద బస్సు నిలబడ్తానే డ్రైవర్ దిగె. కండక్టర్ దిగె. వాళ్లతోగూడా పాసింజర్లు పాలోమని దిగేసిరి. ఎందుకు? ఏమి? అని అడక్కుండా వాళ్ల ఎంబడే నేనూ దిగితి! గొర్రెదాటు జల్మంగదా?

ఆ రోడ్డుకు ఒక మట్టు దిగుదాల. చిట్టిచిట్టి పొదలు. చిన్నచిన్న చెట్లు. వాటికంతా పినపెద్ద మాదిర్తో ఒక యాపమాను! అందురికంటే ముందుగా డ్రైవర్ రోడ్డు దిగె. వాడితో కండక్టర్ దిగె. ఆ యిద్దర్తో గూడా పాసింజర్లు దిగిరి. వాళ్లతో గూడా నేనూ దిగితి. అందురూ కల్సి ఆ యాపమాని కిందికి పోతిమి!

ఆ యాపమానికి ఆనించి మూడురాళ్లు. ఆ రాళ్లకు పసుపు పూసినారు. కుంకం పెట్నారు. పూలహారా లేసినారు. వాటి పక్కన శూలాలు నిలబెట్నారు. ఆ శూలాల కొనాన నిమ్మకాయిలు గుచ్చినారు. అప్పిటికే ఆడ కొంత మంది పొంగళ్లు పెడ్తా ఉండారు.

ఆ మానికి రొంత దూరంలో ఒక కోనేరు. అందురూ ఆ కోనేట్లోకి దిగి కాళ్లూ చేతులు కడుక్కుంట్రి. మల్లా యాపమాని కింది కొచ్చిరి. డ్రయివర్ కర్పోరం ముట్టించె. టెంకాయి కొట్టె. అంతలోకే కండక్టర్ రొన్ని చిల్లరదుడ్లు హుండీలో ఏసేసి వచ్చె. వాళ్లిద్దరు వంగొంగి దండాలు పెట్తావుంటే అందురు దండాలు పెట్రి. వాళ్లతో గూడా నేనూ దణ్ణం పెడ్తి. ఆ దేముడిరాళ్ల ముందర ఒక మూకుడు. ఆ మూకుడు నిండికి కుంకం. ఆ కుంకాన్ని తీసుకోని తలా వొక బొట్టు పెట్టుకుంట్రి. నేనూ పెట్టుకుంటి. ఆ మిందట అందురూ బస్సెక్కిరి. నేనూ ఎక్కితి. బస్సు కదిలె!

యాపమాని కింద మూడురాళ్లు పసుపు పూసి కుంకం బొట్లు పెట్టేకుందికి అవ్వేమో దేవుళ్లయి పాయ. మోకాటెత్తు రాయి దొరికితే వాటికి మొలపాడుగు కూడంట! అది ఏమి దేవుడో? అడగనన్నా అడిగినానా? లేదే? అందురూ దణ్ణం పెట్తావుంటే నేనూ పెట్తి. ఇదే గదా గొర్రెదాటు యవారమంటే? –

''అంజేరమ్మ తల్లంటే అట్టా యిట్టా దేవత గాదయ్యో? ఒకప్పుడు పిలిస్తే పలకతా ఉండె!'' ఎవురో నన్నానుకోని పక్కన్నే కూసోని ఉండాడు. బస్సు దిగి దణ్ణం పెట్టింది చాలదన్నెట్టుగా బస్సులో కూసోని కూడా తిరిగి చూసి తిరిగి చూసి దణ్ణం పెడ్తా ఉండాడు. ఆ మాటతో అది అంజేరికనమని నాకు గుర్తుకొచ్చె. అంజేరికనం గుర్తు కొచ్చేకుందికి ఆ కనమలో కుంటోడి కత గ్యాపకాని కొచ్చె!

అంజేరికనంలో కుంటోడంటే అల్ప సొల్ప మయిన మణిసి గాదు. ఆ కనంలో వాడు ఎప్పుడు ఉణ్ణాడో? ఏం పాడో? యిప్పిటికీ వాడి మాట కతలుగా చెప్పుకుంటానే ఉండారు. ఎవుడైనా యిట్టా బుడ్డబెదిరింపులు బెదిరిస్తే–

''ఒరే! యీడిదంతా అంజేరికనంలో కుంటోడికతగా ఉండాదే?'' అంటా ఉంటారు. ఇంతకూ ఏందబ్బా వాడి కత అంటే? –

నాయాలు కుంటోడా వాడు? చెయ్యెత్తు మణిసి గదా? ఆ కండలు... రగతం కక్కతా ఆ కండ్లు... వాసాల మాదిర ఆ మీసాలు... ఆ రూపు... ఆ యీపు– మరీ ఆ యీపు మిందయితే చాటడు వడ్లు ఆర బొయ్యొచ్చునంట! ఆ మొక రాశి? ఆ రాశి అందురికీ యాడుంటిందిలే? వాడూ ఒకప్పుడు ఆ చుట్టు పక్కల గడ గడ లాడించినోడే! కాలంగాక రొండు కాళ్లూ పొయ్‌నాయి. అయితే ఆ సంగతి నరమానవుడికి తెల్దు. అప్పుడు ఎట్టొచ్చి చేర్నాడో అంజేరమ్మ కనంలో చేర్నాడు. ఆ కనం దోవలో కూసుణ్ణాడు. కూసోని బుడ్డబెదిరింపుల్తోనే బతికి పొయనే మొనగాడు!

అదెట్టా సాద్దె పడిందబ్బా అంటే? –

ఆ కాలాన యిప్పుడు మాదిర రోడ్లు బస్సులు యాడుండె? ఒక ఊరు నుంచి యింకొక ఊరికి పోవాలంటే కాలి దోవలే గదా గెతి? మరీ యిటుమంటి కనమల్లో అయితే ఏరేగా చెప్పాల్నా? కాలికి కాలు కొట్టుకుంటా కాలి నడకలే గదా గెతి! అమాంత మయిన అడివి. కాకులు దూరని ఆ కారడవుల్లో మణుసులు నడవాలంటే? ఏ సెణాన ఏం జరిగితిందో అనే గిలి. అందుకే ఆకనం మొగదాల అంజేరమ్మ తల్లిని నిలుపుకున్నారు. ఆ దోవన వచ్చే పొయ్యే వాళ్లందురూ మమ్మల రచ్చించు తల్లీ! అంటా ఆ తల్లికి తలా ఒక దణ్ణం పెట్టేసి పోతా వుండే వాళ్లంట!

మన కుంటోడు పొయ్ ఆడ గదా కుదురు కున్నాడు. కుదురు కున్నాడంటే ఎట్టా? వాడు కూసోనుండేది చూస్తే వాడు కుంటోడని ఎవుడికీ సందేహం కలక్కుండా అంత బటువుగా కూసున్నాడు. చేతిలో రెట్లావుతో బారడు పొడుగు కట్టె. ఆ దోవన ఎవుడొచ్చినా సరే! ఎంత మందొచ్చినా సరే!...

''ఏయ్ నిలు!'' అనే వాడంట.

అన్నాడంటే అట్టా యిట్నా? ఆ మాటతో ఆ కనం మారు మోగేదంట. రాయీ రప్ప కదిలేదంట. చెట్లు ఊగేవంట. ఆ చెట్ల మింద గువ్వా గుర్రా పైకెగిరి అల్లకల్లోలంగా అర్సేవంట. అటుమంటప్పుడు సాదా సీదా మణిసి ఏమవతాడు?

''రాయిట్టా!'' అని పిల్సే వాడంట. రాకుండా తట పటాయిస్తా ఉంటే-

''వస్తావా?... లేచి రమ్మంటావా?... లేస్తే నేను మణిసిని గాదు?'' అని లేసే దానికి ముంపి నట్లు ముంపి గదమాయించే వాడంట!

గదమాయింపంటే? అయ్యు అల్ప సొల్పమయిన గదమాయింపా అది? నెల్లు నిండినోళ్లయితే ఆణ్ణే కనేసేవాళ్లంట. అదురు బెదురు గుండికాయిలైతే అట్నే నిల్సి పొయ్యేవంట. ఇంకొందురైతే నిలబడుకున్నోళ్లు నిలబడుకుణ్ణెట్టే ఫోసుకునే వాళ్లంట! వాడు లేచి వస్తే ఏం చేస్తాడో ఏమో అని బయి పడ్తా బయి పడ్తా వాడి దగ్గిరికి పోతే-

''పెట్టు! నీ తావన ఏం ఉండాదో అంతా తీసి ఆడ పెట్టు! ఊ!'' అని దబాయించే వాడంట. కుయ్ కయ్ మనకుండా చేతా వాతా ఉండే దంతా తీసిపెట్టేసే వాళ్లంట!

''పో! యింక తిరిగి సూడకుండా పో! తిరిగి సూస్తివో?... జాగర్త!'' అని ఎచ్చరించే వాడంట. పాపం! ఎర్రి నాయాలి గుంపు. తిరిగి చూస్తే ఒట్టు. బతుకంతా యిట్టా మాదిర బెదిరించు కుంటా బతికి పొయ్‌నాడంట. వాడు గదా మొగోడంటే?... మొనగాడంటే?

సరే! వాడేమో మొగలాయి. బుడ్డబెదిరింపుల్తోనే బతికి పొయ్‌నాడు. బాగుండాది. అయితే యింత అన్నాయం కండ్ల ముందర జరిగి పోతావుంటే అంజేరమ్మ తల్లి ఏం చేసినట్టు? అది గదా నన్ను పట్టుకుణ్ణె అనుమానం!

పాపం! ఆమె మాత్రం ఏం చేస్తిందిలే? కుంటోడు గదా? వాడు గూడా బతకాల గదా? అని యిప్పుడు మన ప్రెబుత్వం యికలాంగులకు రాయితీ లిచ్చినట్టు ఆ కాలాన వాడికి కూడా పర్మిషన్ యిచ్చేసి నట్టుండాది.

నేను అంజేరికనం కుంటోణ్ణి గురించి ఆలోచించుకుంటా ఉంటే బస్సు కనం దాటింది. గాజుల మణ్ణెం కాడ సొర్నముకి ఏరును దాటింది. ఆ ఏరు దాటుకుంటానే మిషన్ ఆసిపత్రి. దాన్ని గూడా దాటేసింది. రేణిగుంట మిందగా ఎప్పుడొచ్చిందో తిరపతికి వచ్చేసింది. బస్టాండ్‌లో నిలబడింది.

ఇంకా నాలోకంలో నే నేనుండా! కండక్టర్ ఎచ్చరిస్తే ఎగిరి పడి లేస్తి. బస్సు దిగితి.

నడవాలంటే పాలుమాలిగ్గా ఉండె. ఆ పొద్దంతా ఒక పొద్దు కత అయ్‌పాయ-గదా బతుకు. రిక్సాలో పోదా మనిపించె. అందుకే రిక్సాలుండే తావుకు పోతి. ఆడ పదిపదైదు రిక్సాలు సోలుపుగా నిలబెట్టేసి ఉండారు. వాటి తావన ఒక మణిసి లేడు. ఈళ్లంతా ఏమయి పాయ్‌నట్టబ్బా? అని దిక్కులు చూస్తి!

ఆ రిక్సాలుండే తావుకు రొండు బార్ల దూరంలో అందురు ఉడ్డ చేరుకోని ఉండారు. ఏం జరగతా ఉండాదో చూద్దామని ఆడికి పోతి.

ఎవుడో ఒకడు. నల్లరాత్తో చెక్కిన యిగ్రహం మాదిర్తో పుష్టిగా ఉండాడు. వాడికి మూతి మింద కోరమీసం ఉండాది. ఒంటి మింద మెలి దిరిగిన కండలూ ఉండాయి. యాతం బానంత కడుపూ ఉండాది. అందుకేనేమో చాపిన చెయ్యి చాపతానే ఉండాడు.

రిక్సా వాళ్లుగూడా నువ్వు ముందా? నేను ముందా? అన్నెట్టుగా ఎగబడి వాడిచేతిలో అంతో యింతో పెట్టా ఉండారు. అది చూస్తా ఉంటే బక్తులు ఏ సాదువుకో సన్నాసికో కానికిలు వొకరి మిందొకరుగా ఎగబడి అర్పించి నట్టుండాది. అంతలోకే వాళ్లల్లో ఒకడు చెల్లించేసి చేతులు కడుక్కోని వారగా వచ్చె. వాణ్ణి పిలిస్తి. బేరమాడ్తి. రిక్సా కుదుర్చుకుంటి. అప్పుడడిగితి.

''ఏందిరా అబ్బోడా ఈసంత!'' అని.

''ఏమని చెప్పమంటారయ్యా? పొడిచేస్తా గెలిచేస్తా. మిమ్మలందుర్ని ఉద్దరించేస్తా. దున్నేవాడిదే బూమి అన్నెట్టు తొక్కేవాడిదే రిక్సాగా చేస్తా. అంటా వచ్చె. రొండు దినాలు మాలో ఒకడుగా మసులుకుండె. మా లాగుబాగు తెల్సుకుండె. ఈ యదవలకు ఎనుకూ ముందు ఎవుడూ లేడని తేలేకుందికి వాడి రంగూ తెల్సిపాయ. ఇప్పుడు వాడు మా పాలిటికొక దాదా. వారం మామూలు. నెల మామూలు. ఇచ్చి తీరాల్సిందే! లేకుండాబోతే వాడో వాడి మణుసులో ఏందో ఒక సాకు చూపిస్తారు. గిచ్చి జగడానికి పిలస్తారు. కుక్కల్ను కొట్నెట్టు కొట్తారు. అడిగే నాదుడెవుడు?''

''పోలీసోళ్లుండారు గదా? వాళ్లతో...''

నానోట్లో మాట నోట్లో ఉండంగానే ఆ ఎమికల గూడు యిరగబడి నవ్వె! ఎందుకు నవ్వతా వుండాడో అర్థం గాకుండా వాడికల్లా చూస్తావుంటే-

''అన్నీ తెల్సి అగ్నానంలో పడేదంటే యిట్లాంటిదే గదయ్యా? వాళ్లూ వాళ్లూ వొగిటే గదా? ఇటు మంటోళ్లంతా ఆ పోలీసోళ్లకు ఏజంట్లు గదా? పాయ్ పాయ్ వాళ్లతో చెప్పుకోమంటారే? చెప్పుకుంటే మల్లా చెప్పు దెబ్బ లెవురికి? మాకే గదా?''

ఏం మాట్లాడేది? నోరు మూసుకుంటి. రిక్సా ఎక్కతా ఉండ బట్టలేక మల్లా ఆ గుంపు కల్లా చూస్తి. ఆ తోలు తిత్తుల కల్లా చూళ్లేకుండా చూపులు మల్లించు కుంటి. అప్పుడు కంట బడె. ఎవురు? మనరాజ్జాంగం రాసిన మహన్నబావుడి యిగ్రహం!

''చూడండి. కండ్లు తెరిచి చూడండి. మీ కండ్ల ముందరే ఎంత అన్యాయం జరిగిపోతా ఉండాదో? చూడండి!'' అంటా ఆ దోవన వచ్చే పొయ్యే వాళ్లకు ఏలెత్తి చూపించినట్టు ఆడ నిలబడుకోనుండాది అంబేద్కర్ యిగ్రహం. అయినా ఆయన మాట ఎవురు యినిపించు కుంటా ఉండారు? ఎవురి తాపేత్రం వాళ్లదిగా... ఎవురి దోవ వాళ్లదిగా ఉండాది!

నలగర్తో నారాయణా! నా దోవ నాదయింది.

రిక్సాపోతా ఉండాది. పిచ్చిగానీ దానంతటది ఎట్ల పోతిందిలే? ఆ ఎమికల గూళ్లో యింకా ఏందైనా అంత బలం మిగిలుంటే అది పెట్రోలు మాదిర్తో పని చేస్తా ఉంటే రిక్సా పోతా ఉండాది. పొయ్యేది గాదు కదల్తా ఉండాది. అది ఎట్ల కదల్తా ఉండాదో నాకెందుకు? వాడెట్లా తొక్కతా ఉండాడో నాకెందుకు? వాణ్ణి ఎవుడు బెదిరిస్తే నాకెందుకు? వాడి చెవటతో తేరకు ఎవుడు సుకపడ్తే నాకెందుకు? ఆ మాటకొస్తే నేను సుకపడ్తానే ఉండ్లా? ఇట్లా ఆలోచిస్తా కూసుంటే ఎపుడైనా ఈ లోకంలో మణిసి మణిసిగా బతగ్గలగతాడా? నా ఆలోచన రకరకాలుగా పొయ్ మల్లా దబాయింపు సెక్షన్ కాడికే వచ్చి నిలబడె!

ఏందబ్బా ఈ దబాయింపులు? ఎప్పుడో కనమ దోవలో వచ్చే పొయ్యే వాళ్లను దబాయించుకుంటా కుంటోడు బతికి పాయ. ఈ రిక్సా వాళ్లను యిట్లా దబాయించు కుంటా ఈడెవుడో బతికిపోతా ఉండాడు. ఇంక కొంప కాడి కొస్తే అడిగింది యియ్యకుండా పోతే పిలగాడు ఉరుబోసుకోని చస్తానని బెదిరిస్తాడు. అడుగులకు మడుగు లొత్తకుండా బోతే యింట్లో ఆడది బాయిలో దూకతానంటా బెదిరిస్తింది. సకల మరేదలు సక్కరంగా జరిపించక పోతే నీ కూతుర్ని నీ యింట్లోనే పెట్టుకో అని అల్లుళ్లు బెదిరిస్తారు. నోర్లేనోణ్ణి యింక నోరుండే వాళ్లు బెదిరిస్తారు. అని ఆలోచించుకుంటా ఉంటే ఎప్పుడొచ్చినానో నాలుగ్గాళ్లమండపం కాడికి వచ్చేసినా!

ఆడ ముత్తా రెడ్డన్న అవుపిస్తే రిక్సా దిగినా.

''ఇంక నువ్వు పోరా అబ్బారే!'' అంటే రిక్సా వాడు వదిలి పెట్టిందే చాలనుకోని వాడి దోవన వాడు పాయ.

''బాగా బెట్టబడి పొయ్యుండావే? యాణ్ణుంచిరా అబ్బోడా రావడం?'' అని ముత్తా రెడ్డన్న అడిగె.

ఈసలాపురం వైదిగం కత చెప్తి. నోరట్లా తెరవకుండా యినె. అంజేరికనంలో కుంటోడి కత ఎత్తుకుంటి.

'' ఆడికి నిలపరా అబ్బోడా నిలుపు. ముందు పుట్నె చెవులకంటె ఎనక పుట్నె

కొమ్ములు వాడి! అన్నెట్టుండాది గదరా నీ యవ్వారం. అంజేరికనంలో కుంటోడి కత నాకు తెల్సు. నీ కొచ్చిన అనుమానమూ నాకు తెల్సు. ఆ పొద్దు అంజేరికనంలో బెదిరించుకోని బతికింది కుంటోడు ఒక్కడేరా! ఈ పొద్దుటి కత చెప్పరా!'' అనె.

''దానికేముండా దన్నా? చీగిట్లోగానా ఒంటిగా పోతావుంటే కుక్కలు గూడా బెదిరిస్తాయి.''

''అవ్వి బెదిరింపులు గాదురా పిచ్చోడా! వాటి బయం వాటిది. ఆ బయం నుండి బయిట పడే దానికే వాటి అరుపులు. అవ్వి బెదిరింపు లెందు కవతాయి? ఈ పొద్దు ఎవురెవురు? ఎట్టెట్టా? బెదిరించుకోని బతికి పోతా ఉండారో చెప్పరా చూద్దాం!'' అనె.

కొంపలో కొడుకా? పెండ్లామా? అల్లుడా? రిక్సా వాళ్ల దాదానా? ఎవురని ఆలోచించుకుంటా ఉంటే-

''ఒరే అబ్బోడా! ఆ పొద్దు అంజేరికనంలో కుంటోడు ఒకడైతే ఈ పొద్దు ఎందుర్రా? వాడకొకడు. వర్గానికొకడు. కులాన్ని అడ్డం పెట్టుకోని బెదిరించేది ఒకడైతే మతాన్ని అడ్డం పెట్టుకోని యింకొకడు. కార్మికుల్ను అడ్డం పెట్టుకోని ఒకడు. అసమ్మతి వర్గం ఆసరాతో యింకొకడు. దళితుల్ను అడ్డం పెట్టుకోని యింకొకడు. అందురూ దబాయింపుల్తోనే గదా బతికిపోతా ఉండారు. అంజేరికనంలో కుంటోడన్నా కడుపు కక్కుర్తితో. ఈళ్లకేం గాడా? లచ్చణంగా ఉండి కూడా ఈ బెదిరింపుల్తోనే బతికి పోవాలనుకుంటా ఉండారే? దీన్నే మంటావ్?''

''నిజిమే నన్నా నిజిమే! అయితే అంజేరికనంలో కుంటోడు బతికినంత కాలం ఈ బుడ్డబెదిరింపుల్తోనే బతికె. కడాన ఎవుడో వస్తావా? లేచి రమ్మంటావా? అంటే-

'లేచిరా చూద్దాం!' అంటా ఎదురు తిరిగినాడంట. దాంతో వాడి రంగు బయిట పడె. ఇప్పుడింతమంది బుడ్డబెదిరింపు గాళ్లుంటే వాళ్లకు ఎదురుతిరిగే వాళ్లే లేరంటావా?''

''ఒరే పిచ్చోడా! ఎందుకు ఎదురు తిరగతార్రా? ఎవుడి స్వార్థం వాడిది!''

''కొంపాదిలి పెట్టిందెప్పుడు? వొచ్చిందెప్పుడు? ఈ యరవదాకా ఏం యిరగజేసి మెరుగు పెట్నెట్టు?'' అని మా బాశాలి బెదిరింపులు కొంపకుబోతే ఉండనే ఉంటాయి! అవును. అది ఆపె స్వార్థం!

అంతే మణిసిలో స్వార్థానికి తిరుగులేదు.

ఈ బుడ్డబెదిరింపులకు ఎదురేలేదు! ●